
సాక్షి
అనంతపురం

బుధవారం, 24, సెప్టెంబర్, 2025



టన్ను చీనీ రూ.21 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు, కనిష్టంగా రూ.10 వేలు పలికాయి.



కిలో టమాట రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.14 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3 వేల టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.8°/21.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటలకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.


న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణశాఖ, విశాఖ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు ఈనెల 24వ తేదీన 6.8 మి.మీ, 25న 3 మి.మీ, 26న 2.8 మి.మీ, 27న 15 మి.మీ, 28న 3.2 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.8– 30 డిగ్రీల మధ్య, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.4– 22 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గంటకు 10 నుంచి 13 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

‘అలాంటి దరఖాస్తులు స్వీకరించం’


గమనిక

NFBS దరఖాస్తులు ప్రభుత్వం నుండి అనుమతి వచ్చిన తరువాత స్వీకరించబడును.

తహసీల్దార్
తాడిపత్రి

తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయంలో అంటించిన నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అనేది లేదని, అందుకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించబోమని తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో సిబ్బంది నోటీసు అతికించారు. ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు ప్రచారాన్ని నమ్మి వందలాది మంది వితంతువులు దరఖాస్తు చేసుకోవడానికి తరలిరావడంతో తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బిత్తరపోయారు. దీనిపై ‘సాక్షి’లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోరాదని సూచించారు. గ్రామ సచివాలయాల్లోని సిబ్బందిని సంప్రదించి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు.

బధిరుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

- కలెక్టర్ ఆనంద్



ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: బధిరుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రపంచ బధిరుల, సైన్ లాంగ్వేజ్ దినోత్సవానికి కలెక్టర్‌తో పాటు విభిన్న ప్రతిభావంతుల సంస్థ రాష్ట్ర చైర్మన్ నారాయణ స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ కేక్ కట్ చేసి బధిరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 45 మంది బధిరులకు ఉద్యోగం కల్పించామని, 6,707 మందికి పింఛను అందిస్తున్నామన్నారు. శ్రవణ యంత్రాలను అర్హులైన 948 మందికి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, సర్వశిక్ష అభియాన్ పీడీ శైలజ, ఆర్‌డీటీ ప్రతినిధి రఫీ, బధిరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు లక్ష్మి నరసింహ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు చికిత్సలందించాలి

హెచ్ఐవీ బాధితులకు తప్పనిసరిగా చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదయ్యేలా చూడడంతో పాటు చికిత్స అందించాలన్నారు. చికిత్స తీసుకోవడం ద్వారా హెచ్ఐవీని నియంత్రించవచ్చని, తద్వారా రోగనిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఉంటారనే విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాజిటివ్ నెట్‌వర్క్ ప్రతినిధులు కలిసి నచ్చజెప్పాలన్నారు. డీఎంహెచ్ఓ ఈబీదేవి, డీపీఓ నాగరాజు నాయుడు తదితరులున్నారు.



అనంతపురంలోని కొత్తూరు అమ్మవారి శాలలో అనంత పద్మనాభ, శ్రీదేవి, భూదేవి అలంకారం


జగజ్జననీ.. లోకపావనీ

జిల్లా అంతటా శరవన్నవరాత్రి శోభ నెలకొంది. మంగళవారం శక్తి స్వరూపిణీ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు. అనంతపురం కొత్తూరులోని వాసవీమాత ఆలయంలో అనంత పద్మనాభ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు. – సాక్షి నెట్‌వర్క్



గాయత్రీదేవిగా ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారు

భవిత అంధకారం



- ఫీజు బకాయిల విడుదలలో కూటమి ప్రభుత్వ తాత్సారం
- విద్యార్థుల్లో అయోమయం
- తల్లిదండ్రుల అష్టకష్టాలు
- అక్టోబర్‌లో కళాశాలల మూత దిశగా ప్రైవేటు యాజమాన్యాలు

అనంతపురం: చంద్రబాబు సర్కారు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతోంది. వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకం నిధులను జూన్‌లో విడుదల చేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆ నిధులు ఖాతాల్లో జమయ్యేవి. కానీ, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను విడుదల చేయకుండా నిలిపివేసింది. పాత విద్యా సంవత్సరంలో రెండు త్రైమాసికాలు, ఈ విద్యా సంవత్సరంలో పూర్తయిన మూడు త్రైమాసికాలకు కలిపి రూ. 90 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి పెట్టింది. వైఎస్సార్‌సీపీ ‘యువత పోరుబాట’ నిర్వహించడంతో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక త్రైమాసికానికి సంబంధించి రూ.30 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా, ఇప్పటి వరకు పాక్షిక చెల్లింపులు మాత్రమే జరిగడం గమనార్హం.

పాత బకాయిలూ ఇచ్చిన జగన్..

2019 మేలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సర్కారు రాజకీయాలకు అతీతంగా విద్యార్థులను అండగా నిలిచింది. 2017–19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం చెల్లించింది. అధికారంలో ఉన్న ఐదేళ్లు త్రైమాసికం పూర్తి కాగానే తల్లుల ఖాతాలో నగదు జమ చేసింది. నేడు కూటమి సర్కారు నిధులను విడుదల చేయకపోగా.. అప్పట్లో అమలైన ‘వసతి దీవెన’ పథకానికి కూడా మంగళం పాడింది. పైగా ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదువుతున్నవారికి సైతం రీయింబర్స్‌మెంట్ అందిస్తామని ఎన్నికల ముందు టీడీపీ నాయకులు పలికిన ప్రగల్భాలను నమ్మి ప్రైవేట్ కళాశాలల్లో చేరినవారి నెత్తిన పిడుగు వేసింది.

తాకట్టు పెట్టి మరీ దబ్బు..

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు, పుస్తెలు తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న దుర్భర పరిస్థితి కనిపిస్తోంది. పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు జగన్ ప్రభుత్వం ఉజ్వల బాటలు వేయగా.. తాజాగా కూటమి ప్రభుత్వంలో 2014–19 టీడీపీ అధికారంలో ఉన్నప్పటి పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి. అప్పట్లో సరిగా ఫీజులు కట్టకపోతే విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని పరిస్థితి ఉండేది. దీంతో విద్యార్థులు అష్టకష్టాలు పడ్డారు.

మూసివేత.. ఇంతకంటే దౌర్భాగ్యం ఉంటుందా?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిస్థితి దయనీయంగా మారింది. సిబ్బందికి వేతనాలు, కళాశాలల నిర్వహణ ఖర్చులు భరించలేని స్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏకంగా కళాశాలలను మూసివేయాలని నిర్ణయించడం గమనార్హం. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఈ మేరకు నోటీసు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి కావడం కూటమి ప్రభుత్వ అధ్వాన పాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. వాస్తవానికి ఈ నెల 22 నుంచి కళాశాలలు మూసివేయాలని నిర్ణయించినప్పటికీ, దసరా సెలవులు కావడంతో నిర్ణయాన్ని వాయిదా వేశారు. డిగ్రీ మొదటి సంవత్సరం రెండు, మూడో దఫా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత అక్టోబర్ మొదటి వారంలో కళాశాలలు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



2019-20 నుంచి 2023-24 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ఇలా...

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45,491	103.73
2020-21	50,571	83.78
2021-22	50,702	100.53
2022-23	42,915	105.43
2023-24	40,006	28.08
2024-25	42,000	రెండు త్రైమాసికాలు ఇవ్వాల్సి ఉంది పైసా ఇవ్వలేదు

వసతి దీవెన నిధులు..

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45491	42.37
2020-21	50,571	47.96
2021-22	50,702	45.25
2022-23	42,915	37.46
2023-24	40,006	00.00

బస్సుల్లో వస్తేనే నియామక పత్రాలు

- డీఎస్సీ–25 అభ్యర్థులకు రేపు అపాయింట్‌మెంట్ ఆర్డర్ల అందజేత
- ఏర్పాటు చేసిన బస్సుల్లోనే రావాలంటూ అభ్యర్థులపై ఒత్తిళ్లు
- 12 మందికి మినహాయింపు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25కు ఎంపికైన అభ్యర్థులకు రేపు (25న) అమరావతిలో నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు. అయితే అమరావతికి వ్యక్తిగతంగా వెళ్లేందుకు అనుమతించడం లేదు. తప్పనిసరిగా అధికారులు ఏర్పాటు చేసిన బస్సుల్లోనే రావాలని తీవ్ర ఒత్తిళ్లు చేస్తుండడంతో అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగతంగా ఇతర వాహనాల్లో ప్రయాణాలకు అనుమతించబోమని, తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులోనే రావాలంటూ విద్యాశాఖ అధికారులు మెసేజ్ చేశారు. బస్సుల్లో వచ్చిన వారికి మాత్రమే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇస్తామంటూ బెదిరింపు ధోరణిలో మెసేజీలు పెట్టారని అభ్యర్థులు వాపోతున్నారు. అంతదూరం బస్సుల్లో ప్రయాణం చేయలేమని, రైళ్లు లేదా వ్యక్తిగత వాహనాల్లో వస్తామన్నా కుదరదని అధికారులు తెగేసి చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 6 గంటలకు అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులోని బాలాజీ కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థీ తమ కుటుంబ సభ్యులు లేదా బంధువుల్లో ఆరోగ్యంగా ఉన్న ఒకరిని తప్పనిసరిగా తోడు తెచ్చుకోవాలని, మహిళలైనా, పురుషులైనా అభ్యర్థి ఒక్కరే వస్తే అనుమతించబోమని స్పష్టం చేశారు. కాగా మొత్తం 12 మంది అభ్యర్థులకు బస్సుల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరిలో ఏడుగురు గర్భిణులు, నలుగురు చిన్నపిల్లల తల్లులు, ఒకరు ఆపరేషన్ చేయించుకున్న అభ్యర్థి ఉన్నారు. వీరందరూ నేరుగా అమరావతికి రావొచ్చని డీఈఓ తెలిపారు.

ఆగని ‘గూండా ట్యాక్స్’

- ‘పరిటాల కుటుంబం’ పేరుతో దందా



కక్కలపల్లి టమాట మండీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి టమాట మండీల్లో ‘గూండా ట్యాక్స్’ ఆగడం లేదు. ఒక్కో లారీకి రూ. 2 వేలు, పెద్ద ఐచర్‌కు రూ. 1,000, చిన్న ఐచర్‌కు రూ. 500 చొప్పున అప్పనంగా దోచుకుంటున్నారు. రశీదులు ఇస్తూ పబ్లిక్‌గా దందా సాగిస్తున్నా అటు అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ కనీసం అవైపు కన్నెత్తి చూడడం లేదు. పైసా పెట్టుబడి లేకుండా రోజూ రూ. 3 లక్షల దాకా అడ్డగోలుగా పిండుకుంటున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పేర్లు చెబుతూ కొందరు ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, మండీ యజమానులు కలిసి దందా సాగిస్తున్నారు. అన్నదాతల కష్టాన్ని అడ్డంగా దోచుకుంటున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. టమాట మండీల్లో సాగుతున్న ‘గూండా ట్యాక్స్’పై ఇటీవల ‘సాక్షి’లో వెలువడిన కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బయ్యర్లు, ట్రాన్స్ పోర్ట్, లారీలు, మండీల యజమానులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు గుట్టుగా విచారణ జరిపారు. అయితే, వసూళ్లపై పక్కా సమాచారం ఉన్నా... బయటకు మాత్రం నోరు మెదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లోకల్ లారీ యజమానుల నోట్లో మట్టి

లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌లో పని చేస్తున్న ఓ ముఖ్య నాయకుడు, మరో మాజీ నాయకుడు, ఒక ట్రాన్స్‌పోర్టర్ ముగ్గురూ కలిసి నయాదందాకు పాల్పడుతూ సామాన్య లారీ యజమానుల నోట్లో మట్టి కొడుతున్నారు. వీరు ముగ్గురూ ఒకే సామాజికవర్గం కావడం గమనార్హం. నిబంధనల మేరకు స్థానిక లారీలు అందుబాటులో లేకపోతే బయట వాహనాలను తీసుకోవాలి. ఇక్కడ మాత్రం ఎక్కువగా బయట రాష్ట్రాల వాహనాలకే అవకాశం ఇస్తున్నారు. కోలార్, మస్‌బాగ్, మదనపల్లి ప్రాంతాల నుంచి ఖాళీ బాక్సుల లోడ్లతో వచ్చే వాహనాలకు లోడింగ్ ఇస్తూ లోకల్ వాహన యజమానులకు అన్యాయం చేస్తున్నారు. లోడింగ్ పంపే ఒక్కో వాహనం నుంచి వీరు రూ. 2 వేలు అక్రమంగా వసూలు చేసుకుంటున్నారు. వీరి ముగ్గురి ఆదాయం రోజుకు వేలాది రూపాయలుగా ఉన్నట్లు తెలిసింది. లోకల్ వాహనాలకంటే బయట ప్రాంతాల వాహనాలు రూ. 10 వేలు దాకా తక్కువ బాడుగ రాస్తుండడంతో బయ్యర్లు కూడా వాటివైపే మొగ్గు చూపుతున్నారని లోకల్ వాహనాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏం మాట్లాడినా పరిటాల కుటుంబం పేరు చెబుతున్నారంటూ వాపోతున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ యజమానులదీ అదే దుస్థితి

టమాట మార్కెట్ పరిధిలో సుమారు 12 మంది ట్రాన్స్‌పోర్టర్లు ఉన్నారు. ట్రాన్స్‌పోర్టర్ తరఫున పంపే ప్రతి లోడుకు లారీ యజమాని రూ. 2 వేలు ట్రాన్స్‌పోర్టర్‌కు కమీషన్ ఇవ్వాల్సి ఉంది. బయ్యర్లు వారికి అనుకూలమైన, సేవలపట్ల సంతృప్తిగా ఉండే ట్రాన్స్‌పోర్టర్లకు వాహనాలు కావాలని చెబుతుంటారు. గతంలో ట్రాన్స్‌పోర్టర్లందరికీ దాదాపు సమానంగానే లోడింగ్ అకాశాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే చక్రం తిప్పుతున్నారు. బయ్యర్లు వాహనాలు కావాలంటే తమనే సంప్రదించాలని హుకుం జారీ చేస్తున్నారు. వీరి బెదిరింపులతో చాలామంది నోరు మెదపడం లేదు. వారికి మాత్రమే ఎక్కువ వాహనాలు పెడుతూ...తక్కిన సామాన్య ట్రాన్స్‌పోర్టర్లకు మొండిచేయి చూపుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా టమాట మార్కెట్‌లో సాగిస్తున్న దందాపై ప్రభుత్వ పెద్దలు, కలెక్టర్ దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ
- వెబ్‌ల్యాండ్ కరెక్షన్ అర్జీపై క్షేత్రస్థాయి పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

అనంతపురం రూరల్: భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ హెచ్చరించారు. అనంతపురం రూరల్ మండలం ఏ. నారాయణపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 150–5లో వెబ్‌ల్యాండ్ కరెక్షన్‌పై వచ్చిన అర్జీపై మంగళవారం జేసీ శివ్ నారాయణ్ శర్మ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వచ్చే అర్జీలపై అధికారులు ఎప్పటికప్పుడు విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అర్జీదారులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, మండల సర్వేయర్ రఘునాథ్, వీఆర్ఓ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిండుకుంటున్న యూరియా నిల్వలు

- బఫర్‌స్టాక్ ద్వారా పరిమితంగా సరఫరా



ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో యూరియా కోసం సచివాలయం వద్ద బారులు తీరిన రైతులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో యూరియా నిల్వలు నిండుకుంటున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా కూటమి సర్కారులో పంటలకు అవసరమైన మేరకు ఎరువు వేయలేని పరిస్థితి నెలకొంది. 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ఎక్కడా యూరియా సమస్య ఎదురుకాలేదని రైతులు చెబుతున్నారు.ఇప్పుడెందుకు సమస్య వచ్చిందో అర్థంకాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దండిగా సరఫరా చేశామని కూటమి ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతున్నా.. తగినంత తమకు అందడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని 436 ఆర్ఎస్‌కేలు, మూడు డీసీఎంఎస్‌లు, 13 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు), రెండు రైతు గ్రూపు సంఘాలు (ఎఫ్‌పీఓ), మూడు హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లు, 460 వరకు రీటైల్ దుకాణాల ద్వారా ఇప్పటికే 35 వేల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నా... ఒకట్రెండు బస్తాల కోసం రోజుల తరబడి రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందనేది చెప్పడం లేదు. ఈ సీజన్‌లో డీఏపీ, యూరియా, ఎస్ఎస్‌పీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులు 1.07 లక్షల మెట్రిక్ టన్నులు అందించాలని ప్రణాళిక అమలు చేస్తున్నారు. అందులో యూరియా 26,789 మెట్రిక్ టన్నులు టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 23,400 టన్నుల వరకు సరఫరా అయినట్లు చెబుతున్నారు. ఇది కాకుండా గత ఖరీఫ్, రబీలో మిగులు (ఓపెనింగ్ బ్యాలెన్స్) 15,240 మెట్రిక్ టన్నులు చూపించి రైతులకు పంపిణీ చేశామని చెబుతున్నారు. మరి ఇంత మొత్తంలో పంపిణీ చేసినా ఎందుకు యూరియా సమస్య ఈ స్థాయిలో ఎదురవుతోందనే దానికి సమాధానం చెప్పలేని పరిస్థితి.

పక్కదారి పట్టడంతోనే..

మే, జూన్ నెలల్లో జిల్లాకు చేరిన యూరియాలో చాలా వరకు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో యూరియా కొరత తీవ్రస్థాయికి చేరుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద బస్తా యూరియా కావాలంటే డీఏపీ, కాంప్లెక్స్, లేదా డ్రిప్ మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఎంఆర్‌పీకి మించి విక్రయాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక డీసీఎంఎస్‌లకు సరఫరా చేయడం ఆపేశారు. ఆర్ఎస్‌కేలు, సొసైటీలకు పరిమితంగా సరఫరా చేస్తున్నారు. యూరియా నిల్వలు అడుగంటి పోవడంతో మార్క్‌ఫెడ్ దగ్గర ఉన్న 800 మెట్రిక్ టన్నుల బఫర్‌స్టాక్ నుంచి రోజూ కొన్ని ఆర్ఎస్‌కేలకు పరిమితంగా సరఫరా చేస్తున్నారు. మండలంలో ఒక ఆర్ఎస్‌కేను ఎంపిక చేసుకుని ఏఓలు, ఏఈఓలు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు జాగ్రత్తగా పంపిణీ చేస్తున్న పరిస్థితి నెలకొంది.

లాగిన్ ఆప్షన్.. కష్టాలు ఓపెన్

- మొరాయిస్తున్న మీ భూమి పోర్టల్.. ఓపెన్ కాని భూ నక్ష
- వెబ్‌ల్యాండ్‌లో సకాలంలో తెరుచుకోని భూముల వివరాలు
- ఇదే అదునుగా దోచేసుకుంటున్న మీ సేవ, నెట్ సెంటర్ల నిర్వాహకులు



బొమ్మనహాళ్: కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోంది. ఇన్నాళ్లూ సాఫీగా సాగిన మీ భూమి, భూ నక్ష పోర్టల్‌లో మార్పులు తీసుకొచ్చింది. గత రెండు నెలలుగా మీ భూమి పోర్టల్‌కు ఓటీపీ లాగిన్‌ను ఏర్పాటు చేయడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు అధికమవుతున్నాయి. రైతులు, ప్రజలు తమ భూముల వివరాలను మీ భూమి పోర్టల్‌లో తెలుసుకోలేక అవస్థలు పడుతున్నారు. అనంతపురం జిల్లాలో 4,31,677 హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 2,89,601 హెక్టార్లు వ్యవసాయ భూములు ఉన్నాయి.

నెట్ స్పీడ్ లేకున్నా మొరాయింపే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండలాల్లో నెట్ వేగం అంతంత మాత్రమే. నగరాల్లో మాత్రమే 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో నెట్‌వర్క్ సౌకర్యం సరిగా లేదు. ఈ క్రమంలో గ్రామాల్లో మీ భూమి వెబ్‌సైట్‌లో వివరాలు పొందేందుకు రైతులు ఓటీపీ నమోదు చేశాకే వెబ్‌ల్యాండ్ ఓపెన్ అవుతోంది. నెట్ స్పీడ్ లేకపోయినా మీ భూమి పోర్టల్ ఓపెన్ అవ్వని పరిస్థితి. గ్రామాల్లో మీ భూమి పోర్టల్‌లో భూ వివరాలు పొందేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలోని సమగ్ర భూముల వివరాలన్నీ మాయమయ్యాయి. ప్రస్తుతం చాలా వరకు భూముల వివరాలు కనిపించడం లేదు. ఇదే సమయంలో పోర్టల్ మొరాయిస్తోంది. నెట్ సెంటర్ల వద్ద రోజంతా పడిగాపులు కాస్తున్నా అవసరమైన భూ పత్రాలను పొందలేకపోతున్నారు. భూ వివరాలను గతంలో ఇంటి వద్దే తెలుసుకునే వెసులుబాటు ఉండేది. ఫోన్‌లో కానీ, కంప్యూటర్‌లో కానీ క్షణాల్లో తమకు అవసరమైన భూ వివరాలను తెలుసుకునే వారు. పబ్లిక్ డొమైన్‌లో ఇప్పటి వరకు ఈ ప్రక్రియ సులువుగా ఉండేది. రైతులు తమకు అవసరం వచ్చినప్పుడల్లా 1బీ, అడంగల్, ఎఫ్ఎంబీలను తీసుకునేవారు.

పాత పద్ధతే అమలు చేయాలి



అసలే భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి. అంతే కానీ రైతులపై కక్ష సాధింపునకు పాల్పడే విధంగా కొత్త నిర్ణయాలు అమలు చేయడం సబబు కాదు. మీ భూమి పోర్టల్‌లో తెచ్చిన మార్పులపై క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన భూ పత్రాలు సకాలంలో పొందలేకపోతున్నారు. పాత పద్ధతిలోనే మీ భూమి పోర్టల్ కొనసాగించాలి.

– హనుమేష్, రైతు, దేవగిరి, బొమ్మనహాళ్ మండలం

పత్రాలు పొందలేకపోతున్నాం



మాకు 1బీ, అడంగల్, ఎఫ్ఎంబీ పత్రాలు అవసరం పడ్డాయి. ఫోన్‌లో చూసుకుందాం అనుకుంటే కొత్తగా ఓటీపీ అడుగుతోంది. రోజూ నెట్ సెంటర్ల వద్దకు వెళ్తున్నాను. ప్రస్తుత ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌కు ఓటీపీ విధానం పెట్టిందంట. మొదట్లో ఆ ఓటీపీ చెప్పాలంటే భయమేసింది. తర్వాత చేసేదేమి లేక ఆ ఓటీపీని కూడా చెప్పాను. అయినప్పటికీ నాకు అవసరమైన భూ పత్రాలను పొందలేకపోయాను.

– దేవన్న, రైతు, సింగానహళ్లి, బొమ్మనహాళ్ మండలం

మా చేతుల్లో ఏమీ లేదు



రాష్ట్ర ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌ను అప్‌డేట్ చేసింది. మీ భూమి పోర్టల్‌లో రైతు తన భూమి వివరాలను తెలుసుకోవాలంటే ముందుగా మొబైల్ నంబర్‌తో పాటు ఓటీపీ ఎంటర్ చేస్తే రైతుకు కావాల్సిన భూమి వివరాలు తెలుస్తాయి. ప్రభుత్వమే మీ భూమి పోర్టల్‌ను అప్‌డేట్ చేయడంతో రోజుకు మూడుసార్లు మాత్రమే ఓటీపీని ఎంటర్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. పోర్టల్ మార్పు చేయడం మా చేతుల్లో ఏమీ లేదు. నెట్ వర్క్ సమస్య ఉంటే తప్ప మీ భూమి పోర్టల్ మొరాయించడం జరగదు.

– మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

క్లుప్తంగా

'గూగూడు' హుండీ కానుకల లెక్కింపు



హుండీలోని నగదును లెక్కిస్తున్న భక్తులు

శింగనమల(నార్పల): ప్రసిద్ధ గూగూడు కుళ్లాయిస్వామి – ఆంజనేయస్వామి జంట దేవాలయాల్లో మంగళవారం హుండీల్లోని నగదు, నెలకంథం వల్ల వచ్చిన వెండిని భక్తుల ఆధ్వర్యంలో లెక్కించినట్లు ఎగ్జిక్యూటివ్ అధికారి శోభ తెలిపారు. హుండీలలోని కానుకలను లెక్కించగా రూ.9,46,875 వచ్చిందన్నారు. నెలకంథం లెక్కించగా వెండి 79.350 కిలోలు వచ్చిందన్నారు. ఆదేవిధంగా నార్పలలోని సుల్తాన్‌పేటలోని గొంచి మాన్యం 0.07 సెంట్ల భూమి వేలం వేయగా సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నార్పలకు చెందిన నాగరాజు దక్కించుకున్నాడన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

గుత్తి: జీవితంపై విరక్తితో లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసముండే ఈశ్వర్‌రావు (48) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ భార్య, కుమారుడు, కుమార్తెను పోషించుకుంటున్నాడు. కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. వచ్చే సంపాదనతో తీరే మార్గం కనిపించలేదు. దీంతో మంగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..



సురేష్ (ఫైల్)

పెద్దవడుగూరు: మండల కేంద్రమైన పెద్దవడుగూరుకు చెందిన సురేష్ (32) ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ అవసరాల కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.6.80 లక్షలు అప్పులు చేశాడు. వాటిని తిరిగి చెల్లించే క్రమంలో ఇబ్బందులు పడుతూ వచ్చాడు. డబ్బు సర్దుబాటు కాకపోతుండటంతో కుటుంబ సభ్యులతో చెప్పుకుని బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లోని బాత్రూమ్‌లో పురుగుమందు తాగి.. కేకలు వేశాడు. కుటుంబ సభ్యులు వచ్చి అతడిని పామిడి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

రెండు పాన్ కార్డులు కలిగి ఉండటం నేరం



మాట్లాడుతున్న ఐటీఓ కిరణ్‌కుమార్

గుంతకల్లు: ఒక వ్యక్తి రెండు పాన్ (పర్మినెంట్ అకౌంట్ నంబర్) కార్డులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ (ఐటీఓ) కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. అలా ఎవరైనా రెండు పాన్‌లు కలిగి ఉంటే రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని మీటింగ్ హాలులో గుంతకల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వరంలో ఆధార్‌కార్డుతో పాన్ కార్డు అనుసంధానం వల్ల కలిగే లాభాలు, నష్టాలు, ప్రసుత్త ఐటీ రిటర్న్స్‌లో కొత్త నిబంధనలు, మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథులుగా ఐటీఓతోపాటు ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శివకూమర్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కందూరి కృపాకర్, నాయకులు పసుపుల హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌నారాయణకు 'కీర్తి' పురస్కారం



పురస్కారమందుకుంటున్న పతికి రమేష్‌నారాయణ

అనంతపురం కల్చరల్: తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా అందించే 'కీర్తి పుస్కారం' అనంతపురానికి చెందిన ప్రసిద్ధ సాహితీ–విద్యావేత్త డాక్టర్ పతికి రమేష్‌నారాయణ అందుకున్నారు. మంగళవారం హైదరాబాదులోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన ప్రదానోత్సవ సభలో యూనివర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, శాంతా బయోటెక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాదరెడ్డి, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత సాహితీక్షేత్రంలో బహుగ్రంథకర్తగానే కాకుండా అనువాదరంగంలో విశేష ప్రతిభాపాటవాలతో జనచైతన్యం చేస్తున్నందుకు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారన్నారు. ప్రిన్సిపాల్‌గా, రచయితగా, సామాజికవేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయనకు లోతైన జ్ఞానం ఉందని కొనియాడారు. పురస్కారమందుకున్న డాక్టర్ రమేష్‌నారాయణను డాక్టర్ ఉమర్‌ఆలీషా ప్రతినిధులు రియాజుద్దీన్, షరీఫ్, సాహిత్యభారతి జిల్లా అధ్యక్షుడు గుత్తా హరి, కార్యదర్శి తోట నాగరాజు, సుంకర రమేష్ అభినందించారు. జిల్లాకు ప్రత్యేక గౌరవం తెచ్చారన్నారు.

చీనీ, టమాట మార్కెట్ల పరిశీలన



టమాట మండీని పరిశీలించిన ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధి హిమయుద్దీన్

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ పరిస్థితులు తెలుసుకునేందుకు ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధి హిమయుద్దీన్ తదితరులు మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ మార్కెట్, కక్కలపల్లి టమాటా మండీలను పరిశీలించారు. జిల్లాలో సాగులో ఉన్న పంటల విస్తీర్ణం, దిగుబడులు, మార్కెట్ ధరలు, రైతుల కష్టనష్టాలు, ట్రేడర్ల పరిస్థితి గురించి తెలుసుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడాలని ట్రేడర్లకు సూచించారు. ప్రస్తుతం చీనీ, టమాట ధరలు కాస్త నిలకడగానే కొనసాగుతున్నట్లు తెలిపారు. ధరల్లేక రోడ్డున పడేసే పరిస్థితి తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అలాంటి పరిస్థితి ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని ట్రేడర్లు, మండీ నిర్వాహకులకు సూచించారు. పరిశీలనలో ఉద్యానశాఖ ఏడీ దేవానందకుమార్, ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, హెచ్‌వో రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మారెంపల్లి కాలనీలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న పక్కీరప్ప అనే వ్యక్తిని మంగళవారం కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతని వద్ద నుంచి 48 ప్యాకెట్ల కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అనంతపురం ఎక్సైజ్ పోలీసులు పాలవాయిలో నాటుసారా విక్రయిస్తున్న బాలాజీ నాయక్‌ను అరెస్టు చేసి, 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, అన్నపూర్ణ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తల్లిపాలదానంలో చరిత్ర 'లిఖిత'ం



దర్శి లిఖితను సన్మానిస్తున్న డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నవజాత శిశువుల తల్లులు

అనంతపురం మెడికల్: బిడ్డ ఆకలి తీర్చే ప్రతి మహిళా అమ్మే. కళ్లు కూడా తెరవని పసి కూనలు ఆకలితో అమ్మ స్తనమందుకున్నా పాలు రాకపోతే.. ఆ బిడ్డల పరిస్థితి ఊహించలేం. ఆ తల్లిపడే వేదన వర్ణించలేం. ఇలా ఎందరో మహిళలు ప్రసవం అయ్యాక సకాలంలో పాలుపడక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి 'దర్శి లిఖిత' అమ్మలా మారారు. పాలుపడక ఎటూపాలుపోని స్థితిలో ఉన్న తల్లులకు అండగా నిలిచారు. వేలాది మంది బిడ్డలకు పాలిచ్చి ప్రాణాలు పోశారు.

ఇప్పటివరకు 45 లీటర్ల పాలదానం

అనంతపురానికి చెందిన దర్శి లిఖిత బెంగళూరులోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఇండియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఓ బిడ్డకు జన్మనిచ్చారు. సకాలంలో పాలు పడక బిడ్డకు డబ్బాపాలు పట్టారు. ఆ సమయంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అనంతరం ఆ సమస్యను అధిగమించారు. పొత్తిళ్లలోని బిడ్డకు పాలివ్వలేని స్థితిలో తనలా ఎందరో తల్లులు బాధపడుతున్నారని తెలిసి చలించిపోయారు. ఈ క్రమంలోనే తనవంతుగా తల్లిపాలను దానం చేయాలని భావించారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో 'మదర్ మిల్క్ బ్యాంకు'కు ఇప్పటికే 31 లీటర్ల పాలను ఇచ్చారు. తాజాగా మంగళవారం మరో 14 లీటర్ల పాలను సర్వజనాస్పత్రిలోని మదర్ మిల్క్ బ్యాంకుకు అప్పగించారు. ఇప్పటి వరకు ఆమె 45 లీటర్ల తల్లిపాలను మిల్క్ బ్యాంకుకు అందించడం విశేషం. దీంతో మంగళవారం ఆస్పత్రిలో దర్శి లిఖితను డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అక్కడ పాల కోసం వేచి ఉన్న తల్లులు దర్శి లిఖితకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత మాట్లాడుతూ... దర్శి లిఖిత ఔదార్యం ఎంతో మందికి ఆదర్శమన్నారు. తనకు తెలిసి రాష్ట్రంలోనే ఎక్కడా ఇలా ఈ స్థాయిలో తల్లిపాలను ఇచ్చి ఉండరని తెలిపారు. పాలు పట్టక ఇబ్బంది పడుతున్న తల్లుల కంటతడి తుడిచేందుకు మదర్‌మిల్క్ బ్యాంక్ ద్వారా పాలను అందించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యూట్రీషియనిస్టు పల్లవి, కౌన్సిలర్ రాధ, స్టాఫ్‌నర్సు రమ పాల్గొన్నారు.


ఈ–క్రాప్ తప్పకుండా చేయించుకోండి



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

గుత్తి రూరల్: పంటలు సాగు చేసిన ప్రతి రైతూ తప్పకుండా ఈ–క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. జక్కలచెరువు గ్రామంలో మంగళవారం గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడుతో కలిసి ఆమె పత్తి పొలాలను పరిశీలించారు. రైతు నాగరాజు పొలంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ గుత్తి మండలానికి 30 టన్నుల జిప్సమ్ వచ్చిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే రైతులు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. పత్తి పంటలకు ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం గ్రామ శివారులోని వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ ఇతర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, టెక్నికల్ ఏఓ శశికళ, రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 54మందికి ఉద్యోగాలు



ఉద్యోగం పొందిన వారితో ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి

యాడికి: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ సంస్థ ఉమ్మడిగా నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి తెలిపారు. 266 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో 149 మంది అభ్యర్థులు ఎంపిక కాగా.. అందులో 54 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి వైద్య ఖర్చులకు తనయుడు చోరీల బాట

శివాజీనగర: తండ్రి వైద్యఖర్చుల కోసం తనయుడు చోరీలబాట పట్టి చివరకు కటకటాల పాలయ్యాడు. ఏపీలోని అనంతపురానికి చెందిన ఫిరోజ్ (24) అనే వ్యక్తిని బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ పోలీసులు అరెస్ట్ చేసి రూ. 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తండ్రి క్యాన్సర్ చికిత్స కోసం

నిందితుడు ఫిరోజ్ తన భార్య, కుమారుడితో కలిసి హొసకోట అనుగొండనహళ్లి పరిధిలో నివాసముంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతని తండ్రి మహమ్మద్ పాషా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చికిత్సకు డబ్బు లేక ఫిరోజ్ ఓసారి బైక్‌ను దోచి విక్రయించాడు. అనంతరం డ్రైవర్ వృత్తికి స్వస్తి పలికి బైక్ చోరీలపై దృష్టి పెట్టాడు. బెంగళూరులోని కాడుగోడి, వైట్‌ఫీల్డ్ మెట్రో స్టేషన్ల వద్ద, పార్కింగ్ స్థలాల్లో నిలిపిన బైక్‌లను చోరీ చేసి ఏపీలో విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. బైక్ చోరీ కేసులు అధికం కావడంతో పోలీసులు నిఘా పెంచారు. ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేసి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 12 బైక్‌లను సొంతదారులకు అప్పగించారు. మిగతా వాహనాలకు సంబంధించి చిరునామాల కోసం ప్రయత్నం చేస్తున్నారు.

'పేటీఎం'పై కేసు గెలిచిన లా విద్యార్థి



తన్వీర్ బాషాను అభినందిస్తున్న ఎస్కేయూ లా విభాగాధిపతి శ్రీరాములు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం చదువుతున్న తన్వీర్ బాషా పేటీఎంపై కేసు గెలిచాడు. తన్వీర్ బాషా ఖాతా నుంచి రూ.2,500 ఎలాంటి సమాచారం లేకుండా కట్ చేశారు. దీంతో పేటీఎంపై తన్వీర్ బాషా వినియోగదారుల కోర్టులో కేసు దాఖలు చేశాడు. తన కేసును తనే సొంతంగా వాదించుకున్నాడు. పేటీఎం తప్పిదాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. మంగళవారం వాదనలు విన్న కోర్టు వెంటనే పేటీఎం ఆ మొత్తాన్ని చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా తన్వీర్ బాషాను ఎస్కేయూ లా విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీరాములు అభినందించారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం: రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో ప్రచురించిన కరపత్రాలను జిల్లా కోర్టులో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. గురుప్రసాద్, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్ ఆలూరి రామిరెడ్డి, అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) గౌరవాధ్యక్షుడు సీతారామారావు హాజరయ్యారు. న్యాయవాదుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని, జూనియర్ న్యాయవాదుల కోసం న్యాయ మిత్ర పథకం కింద ప్రతి నెలా శిక్షణ భృతిని పెంపుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రకాష్, కమిటీ సభ్యులు కరిమలగిరి, అశోక్, చంద్రశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

సూపర్.. సేవలు పూర్



అనంతపురం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో రోగికి స్కాన్ తీస్తున్న ఈమె పీజీ విద్యార్థిని. ఇక్కడ విధులు నిర్వర్తించాల్సిన రేడియాలజిస్టు ఎక్కడికి వెళారో తెలియని పరిస్థితి. అదేవిధంగా ఆస్పత్రిలోని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరో సర్జరీ, ఎండోక్రైనాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ తదితర విభాగాల్లో కొందరు వైద్యులు, సిబ్బంది తూతూమంత్రంగా విధులను నిర్వహిస్తున్నారు. దీంతో రోగులు వైద్యం పొందడానికి గంటల తరబడి సమయం పడుతోంది.



దస్ట్‌బిన్‌ను తలపిస్తున్న క్యాజువాలిటీ



పైకప్పు ఊడి ప్రమాదకరంగా వేలాడుతున్న దృశ్యం

- సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులకు వైద్యులు డుమ్మా
- క్యాజువాలిటీ పేరిట ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- కార్డియాలజీలో దెబ్బతిన్న ఫ్లోరింగ్



విరిగిపోయిన స్పెషల్‌కేర్ యూనిట్ డోర్లు

అనంతపురం మెడికల్: పేరుకే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి. సౌకర్యాలు, సేవలు మాత్రం ఆ స్థాయిలో ఉండడం లేదు. ఇక వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఈ ఆస్పత్రి ఉండడంతో ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. కొందరు వైద్యులు విధులకు డుమ్మా కొట్టి పత్తా లేకుండా పోతుండడంతో గంటల తరబడి రోగులు నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. సూపర్‌స్పెషాలిటీలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వార్డుల్లో ఫ్లోరింగ్ సరిగా లేకపోవడంతో పాటు రోగులు ఇంటి నుంచే ఫ్యాన్లు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది.

ఎలా పడితే అలా నిర్మాణాలు..

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో క్యాంటీన్‌కు కేటాయించిన ప్రాంతంలో క్యాజువాలిటీ పేరిట నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.10.7 లక్షలతో పది పడకలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. బాగా ఉన్న ఆస్పత్రిని కళావిహీనంగా మార్చేసేలా తీసుకున్న చర్యలు విమర్శలకు తావిస్తున్నాయి. వాస్తవంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.2 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు. అయినా, అనవసరంగా రూ.10 లక్షలు వెచ్చించడంతో పాటు భవనాన్ని భ్రష్టు పట్టిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా క్యాజువాలిటీలో కేవలం రెండు పడకలు వేసి, అందులో గుజరీని అలాగే వదిలేశారు. క్యాజువాలిటీలో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్, వెంటిలేటర్ తదితర సదుపాయాలు ఉండాలి. దీనికితోడు విధుల్లో ఉండాల్సిన సీఎంఓ అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్సు వైద్యం అందించాల్సిన పరిస్థితి వస్తోంది.

దెబ్బతిన్న ఫ్లోరింగ్..

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని కార్డియాలజీ విభాగానికి సంబంధించి వార్డులో ఫ్లోరింగ్ దెబ్బతింది. వాస్తవంగా గుండె శస్త్రచికిత్సలు, సమస్యలున్న వారు పొరపాటున కిందకు పడితే వారి ప్రాణానికే ప్రమాదం. అటువంటిది సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కనీసం ఫ్లోరింగ్ కూడా వేయించలేని స్థితిలో అధికారులున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కార్డియాలజీతో పాటు ఇతర విభాగాల్లోనూ మౌలిక సదుపాయాలు మృగ్యంగా మారాయి.

క్లుప్తంగా

'ఆర్డీఓ అన్యాయం చేశారు'



మాట్లాడుతున్న బాధితురాలు సుధామణి

అనంతపురం టవర్‌క్లాక్: ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ తాతల ఆస్తిని దాయాదులు ఆక్రమించాలని కుట్ర పన్ని, ఆర్డీఓతో చేతులు కలిపి అన్యాయం చేస్తున్నారని నరసనాయునికుంట గ్రామానికి చెందిన సుధామణి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధామణి మాట్లాడుతూ వారసత్వంగా వచ్చిన భూమికి తప్పుడు వంశ వృక్షం సమర్పించి ఆర్డీఓతో తమది కాదంటూ తీర్పు ఇప్పించారని ఆరోపించారు. దీనిపై కోర్టులో కేసు వేశామని, కోర్టు ఆదేశాలు ధిక్కరించి ఆర్డీఓ తీర్పు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లోనూ తమ పేరు ఉందని, సమగ్రంగా విచారణ జరిపి తీర్పు ఇవ్వాలని కోరారు. దాయాదుల నుంచి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాధితురాలి భర్త ప్రసాద్, తండ్రి వెంకట నాయుడు పాల్గొన్నారు.

పాత బకాయిలు చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పాత బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆప్టా జిల్లా అధ్యక్షుడు సి. గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె వెంకటరత్నం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పీఆర్సీ, డీఏ అరియర్స్, ఈఎల్స్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'మెరుగైన పీఆర్సీతో పాటు పాత బకాయిలు కూడా చెల్లిస్తాం' అని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటిదాకా కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అన్ని బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, పని ఒత్తిడి అధికమైందని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వివిధ సచివాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ సర్వే పేరుతో ఇంటింటా తిప్పుతున్నారని వాపోయారు. పదోన్నతులను కల్పించలేదన్నారు. ఐదేళ్లు పూర్తి అయిన వారిని బదిలీ చేశారని, అదేవిధంగా ఇంక్రిమెంట్లను ఎందుకు వర్తింపజేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటాలు చేస్తామన్నారు. జేఏసీ నాయకులు రామకృష్ణ, కిషోర్, ఆదినారాయణ, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థలో అమినిటీ కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతపురం అర్బన్‌కు కేటాయించిన లే ఔట్‌లలో ఆప్షన్ 1,2 కింద 11,318 ఇళ్లు మంజూరు కాగా 2,338 ఇళ్లు పూర్తయ్యాయని హౌసింగ్ సిబ్బంది తెలిపారు. నిర్మాణ దశలో 2,558, ఆప్షన్ 3 కింద 7,331 ఇళ్లు మంజూరు కాగా 2,507 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. నిర్మాణ దశలో 4,814 ఇళ్లు ఉన్నాయన్నారు. మొత్తం 7,372 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా పురోగతి తీసుకువద్దామన్నారు. అలాగే పీఎంఏవై 2.0 కింద 443 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

అనంతపురం రూరల్: రాజీవ్‌కాలనీ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం రాజీవ్‌కాలనీ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో వీధి లైట్లు, డ్రైనేజీలు, రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెత్త పేరుకుపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మసూద్, వెంకటనారాయణ, ఆర్ఫాన్, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యము

- నందడిగా శరన్నవరాత్రి ఉత్సవాలు


పాతూరు అమ్మవారిశాలలో కాత్యాయనిదేవి, మూకాంబిక దేవి అలంకరణ

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి వేడుకలు సందడిగా సాగుతున్నాయి. అమ్మవారికి ప్రీతిప్రాతమైన మంగళవారం కావడంతో భక్తజనం ఆలయాలకు పోటెత్తారు. వాడవాడలా అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిచ్చారు. ప్రధానంగా కొత్తూరులో వాసవీ మాత కేరళలోని ప్రసిద్ధ క్షేత్రమైన అనంత పద్మనాభుడిగా, పాతూరులో కాత్యాయనిమాతగా దర్శన మిచ్చి భక్తులను అనుగ్రహించారు. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శారదా మాత అర్ధనారీశ్వర అలంకారంలో కై లాస వాహనంపై దర్శనమిచ్చారు. రెండో రోడ్డులోని శ్రీ జ్ఞాన పీఠంలో శ్రీచక్ర నవావరణ అర్చన, అశ్వారూఢ ఆవరణార్చనలు, సాయంత్రం వేదపండితులు చండీ, బాల, అవహంతి హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శంకరమఠంలో గణపతి హోమాన్ని, శారదా మాత అలంకార సేవలను చేశారు. మారుతీనగర్ సీతామాత గాయత్రిదేవిగా పూజలందుకున్నారు.హెచ్చెల్సీ కాలనీ నసనకోట ముత్యాలమ్మకు గాయత్రిమాత అలంకారం, చండీహోమాలను నిర్వహించారు. శివబాలయోగి ఆశ్రమంలో గజలక్ష్మి అలంకారంలో అనంతేశ్వరీ అమ్మవారు ప్రత్యేక పూజలందుకుంది. ఉమానగర్ లో రేణుకా యల్లమ్మ వేపాకు అలంకారంలో దర్శనమిచ్చారు. కొల్హాపూర్ అమ్మవారి మందిరం, గుత్తిరోడ్డు చౌడేశ్వరీ మాత ఆలయం, శివకోటి, సాయినగర్ కనకదుర్గ ఆలయంలో శరన్నవ రాత్రుల సందర్భంగా సందడి నెలకొంది.



గాయత్రిమాత అలంకారంలో హెచ్చెల్సీ కాలనీ ముత్యాలమ్మ


మారుతీనగర్‌లోని రామాలయంలో గాయత్రి మాతగా సీతాదేవి


పూజలందుకున్న నిముషాంబాదేవి


బాలయోగి ఆశ్రమంలో గాయత్రిమాతగా అనంతేశ్వరి


మొదటిరోడ్డులో అర్ధనారీశ్వరిగా శారదామాత


చిన్మయనగర్ శివాలయంలో గాయత్రీదేవి అలంకరణలో దుర్గాదేవి


పంపనూరు ఆలయంలో అలంకరణలో పార్వతీదేవి


కనగానపల్లి: గాయత్రీ దేవిగా సల్లాపురమ్మ


చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి


రేణుకా యల్లమ్మ దేవాలయంలో వేపాకు అలంకరణ


పాతూరు అమ్మవారి శాలలో నృత్యప్రదర్శన చేస్తున్న పట్నం శివప్రసాద్ శిష్యబృందం

శేష వాహనంపై వేంకటేశ్వరుడు


ఆర్ఎఫ్‌రోడ్డు వాహనసేవల్లో శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: బ్రహ్మాండనాయకుడైన శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు 'అనంత'లో వైభవంగా సాగుతున్నాయి. శ్రీనివాసనగర్, రామ్‌నగర్‌లలోని వేంకటేశ్వరాలయాలకు భక్తులు పోటెత్తుతుండగా...గోవింద నామస్మరణ మార్మోగుతోంది. హౌసింగు బోర్డులోని వేంకటేశ్వరాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. అలాగే ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరాలయంలో రెండోరోజు మంగళవారం వాహన సేవలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీవారికి పంచామృతాభిషేక సహిత అలంకార సేవల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఉభయదేవేరులతో కలిసి వేంకటేశ్వరుడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. ఆదిశేషుని వాహనంపై స్వామివారు ఊరేగుతుండగా... దారి పొడుగునా భక్తులు హారతులు పట్టి నీరాజనాలర్పించారు. కళాకారులు చెక్కభజన, కోలాటాలతో భక్తిభావాన్ని పెంచారు.

కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి


ఆర్ఐఓ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆధ్వర్యంలో ఆర్ఐఓ కార్యాలయ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్, వంశీ మాట్లాడుతూ... వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ఇంకా ఎనిమిది నెలలు గడువు ఉన్నా... కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ 'మీరు మా కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ ఇప్పుడే చేసుకుంటే ఫీజు రాయితీ కల్పిస్తాం. ఏప్రిల్, మేలో చేసుకుంటే సీట్లు ఉండవు' అని మాయమాటలు చెబుతున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే ఇంటింటా ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి నాని, నాయకులు బాబ్‌జాన్, సాయి, ప్రశాంత్ కుమార్, ఆరీఫ్ పాల్గొన్నారు.

నీ పెత్తనమేంటి దగ్గుపాటీ?

- ఎమ్మెల్యే తీరుపై మేయర్ వసీం మండిపాటు


మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: 'వైఎస్సార్ సీపీ పాలక వర్గం ఉన్నా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అతి జోక్యం చేసుకుంటూ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు. అసలు నీ పెత్తనం ఏంటి దగ్గుపాటీ' అని మేయర్ వసీం ప్రశ్నించారు. మంగళవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల హౌసింగ్ బోర్డులో ఎస్ క్యాప్ నిధులు రూ.2 కోట్ల తో బీటీ రోడ్డు పనులు ప్రారంభించారని, ఈ క్రమంలో నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి ప్రోటోకాల్ పాటించకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యేకి సాధారణంగానే అవగాహన తక్కువని, ఇక నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఇంజినీర్లు ముందుచూపు లేకుండా ఎమ్మెల్యేకు వంత పాడుతూ నగర ప్రథమ పౌరుడిని అవమానిస్తున్నారన్నారు. ఇదే విషయపై కలెక్టర్ ఆనంద్, డీఎంఏకు ఫిర్యాదు చేస్తామని మేయర్ హెచ్చరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అభివృద్ధికి ఎటువంటి నిధులను ప్రత్యేకంగా విడుదల చేయించలేని నిస్సహాయుడని మండిపడ్డారు. అస్తమానం గత ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని వ్యాఖ్యలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్, అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి, రూ.2,403 కోట్ల సంక్షేమాన్ని అందించిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతను విమర్శించే అర్హత దగ్గుపాటికి లేదన్నారు.

అలజడి వాతావరణం సృష్టించారు..

అనంతపురం నగరమంటే ప్రశాంతతకు మారుపేరని, అటువంటి నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ఆయన అనుచరులు అలజడి వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. దౌర్జన్యాలు, కబ్జాలు, పోలీసు స్టేషన్లలో సెటిల్‌మెంట్లు, బార్లు, లాడ్జీల్లో గొడవలు, వైన్ షాపులు ఇదీ దగ్గుపాటి అండ్ కో అభివృద్ధి అని దుయ్యబట్టారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో దగ్గుపాటికి కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, నాయకులు సాకే కుళ్లాయస్వామి, చింతకుంట మధు, రామచంద్ర, నాగార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దస్తగిరి స్వామి గ్యార్మీ వేడుకలు


ఉత్సవాలకు సిద్ధమైన మాబుసుబానీ దర్గా

అనంతపురం కల్చరల్: మహిమాన్వితుడిగా పేరు గాంచిన మాబు సుబహానీ (దస్తగిరి స్వామి) ఉరుసు(గ్యార్మీ) ఉత్సవాలు బుధవారం నుంచి పదిరోజుల పాటు కనుల పండువగా జరగనున్నాయి. ఈ మేరకు మంగళవారం నగరంలోని శ్రీనివాసనగర్‌లో షాహే గౌసే ఆజం ఆషార్ దర్గాలో జరిగిన ప్రత్యేక సమావేశంలో కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ తెలియజేశారు. ఈసారి జష్నే గౌసుల్ వారా పేరుతో రోజూ రాత్రి 9 నుంచి 11 గంటల వరకు దస్తగిరి స్వామి జీవిత విశేషాలు, మహిమలను వివరించడానికి వివిధ రాష్ట్రాల నుంచి మతపెద్దలు అనంతకు విచ్చేస్తున్నారు. ఆధ్యాత్మికతను నింపే విధంగా నిత్యం దస్తగిరి స్వామి విశేషాల ప్రసంగాలు ఉంటాయి. వచ్చేనెల 3న రాత్రి గంధం ఉత్సవం జరుగుతుంది. నగరవీధుల్లో భారీ ఎత్తున ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారుక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా, మొహమ్మద్ ఖుషాల్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రసంగాలుంటాయి. 4న ఉరుసు ఉత్సవం, అదేరోజు సాయంత్రం దస్తగిరి స్వామి వారి పవిత్ర కేశాన్ని ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేస్తారు. ఉరుసు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా కర్నూలుకు చెందిన హజరత్ సయ్యద్ షా వజ్యుద్దీన్ ఖాదరి విచ్చేసి గుసుల్, దువా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కులమతాల కతీతంగా సాగే ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు నవీద్ ఖాన్, అబ్దుల్ సమీ కోరారు.

'గిరి బలిజ' పేరును మార్చాలి

అనంతపురం టవర్‌క్లాక్: దొమ్మర కులాన్ని 'గిరి బలిజ'గా మారుస్తూ కూటమి సర్కార్ జీఓ ఇచ్చిందని, వెంటనే ఆ జీఓను రద్దు చేయాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక శ్రీనివాసమనగర్‌లోని బాలాజీ కల్యాణ మంటపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ దొమ్మర కులం పేరు మార్చడాన్ని తాము కూడా స్వాగతిస్తున్నామన్నారు. అయితే 'గిరి బలిజ' అని బలిజ పదం చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే బలిజ అనే పదం మార్చాలని కోరారు. సమావేశంలో పలువురు బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు 'గౌరవం' ఇవ్వండి

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ పరిధిలో మారుమూల ప్రాంతాల్లో సైతం పశువైద్య సేవలు అందిస్తున్న గోపాలమిత్రలకు గౌరవ వేతనం ఇవ్వకుండా తీరని అన్యాయం చేస్తున్నారని అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు మంజూరు చేయాలంటూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పశుశాఖ జేడీ కార్యాలయంలో మేనేజర్ మంజులను కలిసి వినతి పత్రం అందజేశారు. అసలే తక్కువ గౌరవ వేతనంతో పనిచేస్తున్న తమకు ఐదు నెలలుగా ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో కుటుంబ పోషణ కూడా ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 315 మంది వరకు గోపాలమిత్రలు పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు తమకు కనీస వేతనంతో పాటు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ నాయకులు హెచ్.రంగప్ప, నాగభూషణస్వామి, బి.ఎర్రిస్వామి, శివయ్య, కుళ్లాయప్ప, బాలకొండయ్య, శివప్రసాద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

'కూటమి'వి కార్మిక వ్యతిరేక విధానాలు

రాప్తాడురూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు మండిపడ్డారు. కార్మికులు 10 గంటలు పని చేయాలని, మహిళలు రాత్రిపూట డ్యూటీలు చేసేలా అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలోని ఐఎంఎల్ డిపో వద్ద హమాలీలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. రామాంజనేయులు మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 10 గంటల పని దినంగా మారుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహమై కార్మికులకు నష్టం చేసేలా పని గంటలు పెంచడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పునరాలోచించి 10 గంటల పని దినం నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని రంగాల కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, నాయకులు రాజు, పుష్పరాజు, నాగార్జున, మారుతి, మోహన్ బాబు, పెద్దన్న, నల్లప్ప, రాజు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లకు ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు. అకడమిక్ అంశాలు వర్క్ బుక్‌లు, పరీక్షల తీరు, యాప్‌లు తదితర అంశాలపై చర్చించి వాటిని రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తీర్మానించారు. ఎస్టీయూ ఎప్పుడూ ఉపాధ్యాయుల పక్షాన నిలబడుతుందన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర మునిసిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ ఫణి భూషణ్, సీనియర్ నాయకులు శివయ్య ఆచారి, రాష్ట్ర కౌన్సిలర్ కె. కృష్ణమోహన్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి జి. నారాయణ స్వామి, మండలాల నాయకులు ఎస్ చంద్రశేఖర్‌స్వామి, ఎం శ్రీనివాసులు, ఆర్ నాగేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

హామీలను బాబు విస్మరించారు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో యువతకు చంద్రబాబు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఏఐవైఎఫ్ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. డీఆర్ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో సంఘం నగర కార్యదర్శి శ్రీనివాస్, ఇతర నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరవుతున్నా ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. తీవ్రస్థాయిలో ఉన్న నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వలంటీరు వ్యవస్థను కొనసాగించాలన్నారు. విద్యార్హత ఆధారంగా వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, అశోక్, కన్నా, తేజ, తదితరులు పాల్గొన్నారు.

పీజీలు, హౌస్‌సర్జన్‌లే దిక్కు!


ఓపీలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొందరు వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది బాధ్యతారాహిత్యం మరోసారి బహిర్గతమైంది. సాక్షాత్తు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి తనిఖీలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండడం లేదని రుజువైంది. మంగళవారం సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు ఆస్పత్రిలో మధ్యాహ్నం ఓపీలను పరిశీలించారు. మొదటగా ఇంజెక్షన్ గదిలోకి వెళ్లి చూడగా డ్యూటీ స్టాఫ్‌నర్సు వసంత అందుబాటులో లేరు. హెడ్‌నర్సు లలిత పత్తా లేకుండా పోయారు. మెడిసిన్, చిన్నపిల్లల విభాగం ఓపీల్లో పీజీ, హౌస్‌సర్జన్లు మాత్రమే ఉన్నారు. సర్జికల్ ఓపీలోనూ అదే పరిస్థితి. ఇక ఆర్థో మేల్ ఓపీలో ఉన్నా..ఫీమేల్ ఓపీని మూత వేసేశారు. గైనిక్ ఓపీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈని సస్పెండ్ చేయాలి


ఈఈ రమేష్‌తో వాగ్వాదానికి దిగిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు

రాప్తాడు: మండలంలోని హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీకి మంగళవారం వచ్చిన విద్యుత్‌శాఖ ఈఈ జేవీ రమేష్‌తో సీఐటీయూ నాయకులు వాగ్వివాదానికి దిగారు. ఎల్‌సీ తీసుకొని పనిచేయించాల్సిన ఏఈ కిందిస్థాయి సిబ్బందికి చెప్పి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతోనే ఈనెల 21న పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రైవేటు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మస్నీల రామాంజినేయులు విమర్శించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న అతన్ని ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్ నాయుడుని వెంటనే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఈఈ, ఎస్ఈ కార్యాలయాలతో పాటు కలెక్టర్ కార్యాలయం దగ్గర ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు పుష్పరాజ్, బ్రహ్మయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో జిప్సం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌కు పంటలకు అవసరమైన జిప్సం, సస్యరక్షణ కోసం కొన్ని రకాల పురుగు మందులు రాయితీతో అందించనున్నట్లు వ్యవసాయశాఖ అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. 50 కిలోల జిప్సం పూర్తి ధర రూ.262 కాగా రైతులు తమ వాటా కింద రూ.187 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిప్సం వేరుశనగ దిగుబడులు పెరిగేందుకు దోహదం చేస్తుందన్నారు. ఇక అసిటమాప్రిడ్, పిప్రోనిల్, ఇమిడాక్లోప్రిడ్, కార్బండిజమ్, హెక్సాకొనజోల్, మాంకోజెబ్, ప్రొపినకొనజోల్, వలిడామైసిన్, క్లోరిఫైరిపాస్, నొవాల్యురాన్, అట్రజిన్, క్లోరోంథనిలిప్రోల్, ఇమామెక్టిన్ బెంజోయేట్, క్వినాల్‌ఫాస్, క్లోరాంథనిల్, ట్రైకైజోల్ లాంటి పురుగు మందులు కూడా రాయితీతో అందజేస్తామన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయం లేదా ఏఓలను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.